# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 15, మార్చి 2026


## పదవ తరగతి పరీక్షలు

# ప్రశాంతంగా పూర్తి చేయాలి

➪ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, మార్చి 14, ప్రభాతవార్త:**

జిల్లాలో పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో, నిర్మల్ పట్టణంలోని సోమవార్ పేట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు పరీక్షా గదులను సందర్శించి, పరీక్షలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. విద్యార్థులకు కల్పించిన బెంచీలు, వెలుతురు, తాగునీరు వంటి మౌలిక వసతులను పరిశీలించి, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. కేంద్రంలో కేటాయించిన విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని, అన్ని పరీక్షలను పకడ్బందీగా పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, ఇతర అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుతపులిని హతమార్చిన

# ముగ్గురు నిందితుల అరెస్ట్

చిరుత గోర్లు స్వాధీనం ✶ వేటాడి మృతదేహాన్ని కాల్చివేసినట్లు దర్యాప్తులో వెల్లడి

**జన్నారం, మార్చి 14, ప్రభాతవార్త:**

కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని తాళ్లపేట రేంజ్ అటవీ సిబ్బంది చిరుతపులిని హతమార్చిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్ మోహన్ తెలిపారు. నిందితుల వద్ద నుంచి చిరుతపులి గోర్లు మరియు ఇతర వన్యప్రాణులకు సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. దండేపల్లి మండలానికి చెందిన కొంతమంది అనుమానాస్పద వ్యక్తులు వన్యప్రాణి వస్తువుల వ్యాపారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని సమాచారం అందడంతో అటవీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిందితులను పట్టుకున్నారని తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితులు దండేపల్లి మండలం ఊట్ల గ్రామానికి చెందిన మొద్దె వెంకటేష్, మొద్దె శ్రీనివాస్ మరియు పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన వనపర్తి శ్రీకాంత్ అని వివరించారు. దండేపల్లి మండలం ఊట్ల గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మోటారు వాహనాల క్లచ్ వైర్‌తో ఉచ్చులు వేసి చిరుతపులిని వేటాడి చంపినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అనంతరం చిరుత గోర్లను తొలగించి మృతదేహాన్ని కాల్చివేసినట్లు గుర్తించామని తెలిపారు. నిందితులు చిరుతను వేటాడిన ప్రదేశాల నుండి నేరానికి సంబంధించిన సాక్ష్యాలను అటవీ అధికారులు సేకరించారని చెప్పారు. ఈ ఘటనలో స్థానిక పశువైద్య అధికారి నిర్ధారించినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. నిందితులను న్యాయ స్థానం ముందు హాజరు పరుస్తామని, దర్యాప్తులో భాగంగా స్నిఫర్ డాగ్ హంటర్ సహాయాన్ని కూడా వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.



# నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**వాంకిడి, మార్చి 14, ప్రభాతవార్త**

వాంకిడి మండల కేంద్రంలో మండల బిజెపి నాయకులు, రైతులు నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వాంకిడి మండల బిజెపి అధ్యక్షుడు చిదర్ల నరేశ్, మండల యువ నాయకుడు దుర్గం ప్రశాంత్ మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధి పథకం కింద 22వ విడతగా దేశం మొత్తం 18,600 కోట్లకు పైగ 2000 రూపాయల చొప్పున ప్రతి

మిగతా 2లో..



## ప్రజలకు ఇబ్బందులు లేకుండా

# గ్యాస్ సిలిండర్ల సరఫరా

✦ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మార్చి 14, ప్రభాతవార్త**

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్‌పిజి సిలిండర్లు సరఫరా చేస్తామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డిసిపి భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, ఏసిపి ప్రకాష్‌లతో మిగతా 2లో..

## మంచిర్యాలను రాష్ట్రంలోనే

# ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

✧ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

✧ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

- నస్పూర్, మార్చి 14, ప్రభాతవార్త



2లో..

## మంచిర్యాలను రాష్ట్రంలోనే
# ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

**నస్పూర్, మార్చి 14, ప్రభాతవార్త**

మంచిర్యాలను రాష్ట్రంలోనే ఉత్తమ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు. శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 37, 55, 14 డివిజన్లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత పేరిట నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో పరిశుభ్రత, పారిశుద్ధం మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య పనులను నిశితంగా పరిశీలించిన ఆయన మున్సిపల్ సిబ్బందితో చర్చించారు. వార్డుల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బందికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పట్టణ అభివృద్ధిలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మంచిర్యాల, మార్చి 14, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఐబీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి గవర్నమెంట్ హాస్పిటల్‌లో పండ్ల పంపిణీ కార్యక్రమం చేసి అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో అల్పాహార కార్యక్రమం నిర్వహహించి, ఐబిలోని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తన్నీరు మధుకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భవించి నేటికి 12 సంవత్సరాలు పూర్తి చేసుకుని 13 సంవత్సరాల అడుగుపెడుతున్న శుభ సందర్భంలో పవన్ కళ్యాణ్ ఎంతో కృషితో గత 12 సంవత్సరాలుగా ప్రజల కొరకు నిరంతరం కృషి చేస్తూ ఈరోజు ఆంధ్రప్రదేశ్ లో అధికారం రావడానికి కీలక పాత్ర పోషించి డిప్యూటీ సీఎం అయ్యారని, అలాగే పవన్ కళ్యాణ్ రానున్న రోజుల్లో దేశంలోనే కీలక నేతగా ఎదుగుతారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విష్ణు, సిద్దు, పిట్టల సుధాకర్, ఆవుల సాగర్, మేకల సుధాకర్ రంజిత్ 45వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి పిట్టల సంధ్యారాణి, 6వ కార్పొరేటర్ అభ్యర్థి కుమారి హర్షిత రమేష్, రాకేష్, రఫీ,సురేందర్ రెడ్డి, సాయి కుమార్ జనసేన నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన దస్నాపూర్ సర్పంచ్

**వేమనపల్లి, మార్చి 14, ప్రభాతవార్త**



మండలంలోని దస్నాపూర్ గ్రామ సర్పంచ్ మడే శ్రీనివాస్, వార్డు సభ్యులు బోర్కుటి కిష్టయ్య, మడే శ్రీను, దుర్గం వనితలు అలాగే కల్మలపేట గ్రామానికి చెందిన మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు తోకల ఒల్లేష్‌తో పాటు 80 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం బెల్లంపల్లి కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో వీరు చేరారు. చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ఆకర్షించడంతో పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, సర్పంచ్ లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, నాయకులు కుర్రు వెంకటేశం, ఒడిల రాజన్న, గాలి మధు, తోకల రామచందర్, జాహిద్ అలీ, కొమురం రమేష్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వచ్ఛతకు పోలీసుల శ్రీకారం

**ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో స్వచ్ఛత కార్యక్రమం**

**కోటపల్లి, మార్చి 14, ప్రభాతవార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కోటపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సమిష్టిగా పాల్గొని స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లోపల, బయట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అలాగే ఆవరణలో అస్తవ్యస్తంగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. స్టేషన్‌లోని రికార్డులను కూడా క్రమపద్ధతిలో సర్దుతూ దుమ్ము ధూళి లేకుండా పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు పరిశుభ్రమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలతో స్టేషన్‌కు వచ్చే వారు ఇక్కడి పరిసరాలను చూసి మానసిక ప్రశాంతత పొందేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం పని ఒత్తిడిని తగ్గించడమే కాకుండా ప్రజల్లో పోలీసుల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో విడుదల చేయాలి

**మంచిర్యాల, ప్రభాతవార్త**



ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీ జనాభా ఉంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీల శాతం కేవలం 9 శాతం మాత్రమే ఓ పక్క మా జనాభా ఎంతో మా వాటా అంత కావాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ మా వాటా ఇవ్వకపోగా మండల కమిషన్ సిఫార్సుల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన పాపాన పోలేదని, ఏ ప్రభుత్వం కనీసం ఔట్సోర్సింగ్ ఉద్యోగాలలో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే నిరుద్యోగ బిసి యువతకు అవకాశాలు కల్పించిన వారు అవుతారని, ఎలాగూ ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు అమలు చేస్తలేరు కనీసం ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలోనైన 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి బీసీ యువతకు న్యాయం చేయాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితిగా డిమాండ్ చేస్తున్నామని,లేని పక్షంలో నిరుద్యోగ యువతతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్ ,శాఖ పూరి బీమ్సేన్ ,రాజన్న చారి, చంద్రగిరి చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల 53వ వార్షికోత్సవ వేడుకలు

**- ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు**

**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ద్వారకానగర్ పాఠశాలలో 53వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సాహీన్ సుల్తానా, వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య పాల్గొని పాఠశాల కమిటీ సభ్యులతో కలిసి దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ పాఠశాల చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృుతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభ కనబరచాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృుతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. చిన్నారుల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. విద్యార్థుల ప్రతిభను చూసి అతిథులు ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా విద్యలో, క్రీడల్లో, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో హితైషులు, పోషకులు, పూర్వ విద్యార్థులు, పూర్వ పోషకులు, సమాజ బాంధవులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

(మొదటిపేజీ తరువాయి)

రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు, రైతులకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తూ వారి సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సన్మాన్ నిధి పథకం ద్వారా ప్రతి సంవత్సరం రైతులకు 6000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం వల్ల రైతులకు కొంత వరకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జనరల్ సెక్రటరీ రామగిరి విశాల్ గారు మేంగ్రే శ్రీకాంత్ ఉపాధ్యక్షులు దేనవేని గొల్ల , ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు దుర్గం వానేష్ సీనియర్ నాయకులు రాజేశ్వర్ వెంకటయ్య గూలబ్ ఆకాశ్, నిచల్, నాగేశ్, నాగరాజ్, నాగ రైతు సంఘాల ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా
# గ్యాస్ సిలిండర్ల సరఫరా

(మొదటిపేజీ తరువాయి)

కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ఎల్పిజి డీలర్లతో సమావేశం నిర్వహించి జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు అవసరానికి సరిపడా అందుబాటులో ఉన్నాయని, సిలిండర్ల బుకింగ్, నిల్వలపై సమీక్షిస్తున్నామని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు, గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్‌లైన్‌లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్‌కు ఓటిపి చెప్పి సహకరించాలని, హోటల్, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్ లో సిలిండర్లను విక్రయించాలని చూస్తే నిత్యవసరల సరుకుల చట్టం 1955 క్రింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్పిజి వినియోగదారులు కెవైసి తప్పనిసరిగా చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్ లైన్, గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్, యాప్‌లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 14, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలంలో శనివారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. మండల పరిధిలో ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1596 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, అందులో 8 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పరీక్షా కేంద్రంలో ఒకరు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నజ్రుల్‌నగర్ నం.5 పరీక్షా కేంద్రంలో ఒకరు గైర్హాజరయ్యారు. అలాగే శాంతినికేతన్ ఉన్నత పాఠశాల ఈస్గాంలో పరీక్షా కేంద్రంలో ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదని దీంతో మొత్తం ఎనిమిది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేయడంతో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాశారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పర్యవేక్షణతో పాటు భద్రతా చర్యలు కూడా చేపట్టినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా మండలాల్లో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు,వారి తల్లిదండ్రులు రావడంతో సందడి నెలకొంది. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. పరీక్ష రాయడానికి వెళ్తున్న విద్యార్థులకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆల్‌దబెస్ట్ చెప్పారు.

## రైతు సమూహాల సమీకరణపై అవగాహన సదస్సు

**- రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ఆదాయం పెంపు వ్యవసాయ అధికారుల సూచనలు**

**మందమర్రి రూరల్, మార్చి 14,ప్రభాతవార్త:**



వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ ఆధ్వర్యంలో రైతు సమూహాల సమీకరణపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మందమర్రి మండలం బొక్కలగుట్ట వద్ద గల రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాద్ రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కలిసి సమూహంగా సంస్థను ఏర్పాటు చేసుకుంటే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చని తెలిపారు. అలాగే రైతులు తమ పంటలను సమూహంగా మార్కెట్‌లో విక్రయించడం ద్వారా మంచి ధరలు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం, శిక్షణ మరియు మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తోందన్నారు. అలాగే నిల్వ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్ వంటి కార్యక్రమాలను కూడా చేపట్టవచ్చని వివరించారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా మార్కెట్‌కు చేరుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. దీంతో రైతుల ఆదాయం పెరగడంతో పాటు ఉత్పత్తి వ్యయం తగ్గి మార్కెట్‌లో రైతుల చర్చా శక్తి పెరుగుతుందని తెలిపారు. అలాగే వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, సైండ్ల కనకరాజు, ఉద్యానవన శాఖ అధికారి కల్యాణి, ఆయిల్ పామ్ కార్యనిర్వాహకుడు అజయ్, సర్పంచ్ మాసు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న బచ్చువార్ శివశంకర్

## సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు లక్ష రూపాయల విరాళం

భైంసా, మార్చి 14, ప్రభాతవార్త

భైంసా పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి బచ్చువార్ శివశంకర్ లక్ష రూపాయల విరాళం అందజేశారు. తన తండ్రి దివంగత కాశీనాథ్ బచ్చువార్ జ్ఞాపకార్థం, పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ఈ ఆర్థిక సాయాన్ని శనివారం పాఠశాల కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిశుమందిర్ పాఠశాలలు విద్యార్థులలో దేశభక్తిని, నైతిక విలువలను పెంపొందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాయని కొనియాడారు. సమాజ నిర్మాణంలో విద్యాదానం అత్యంత గొప్పదని, ప్రాచీన భారతీయ సంస్కృతిని కాపాడుతూ విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి కృషి చేస్తున్న ఈ సంస్థకు తన వంతు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. శిశుమందిర్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ యథాశక్తి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్, పాఠశాల అధ్యక్షుడు డి. శ్రీధర్, సమితి అధ్యక్షుడు శివకుమార్ బచ్చువార్, కార్యదర్శులు నాకల సురేష్, పేండపు కాశీనాథ్, తోట రాము, కోశాధికారి ముత్యపువార్ రాజ్ గంగాధర్, సభ్యులు గుజ్జులవార్ లక్ష్మణ్, రావుల పోశెట్టి, పేరుగు నవీన్, ప్రధానాచార్యులు శ్రీరాముల గంగాధర్ పాల్గొన్నారు.



చైర్మన్, కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఠాగూర్ యూత్ సభ్యులు

## ఠాగూర్ యూత్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల సన్మానం

భైంసా, మార్చి 14, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని రామ్‌గోపాల్ నగర్ ఠాగూర్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తు, వైస్ చైర్మన్ ఇద్రిస్, కౌన్సిలర్ల సన్మాన కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువనేత బాజీరావు ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ సందర్భంగా బాజీరావు మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా భైంసా పట్టణం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో టౌన్ ప్లానింగ్, ఫ్లైఓవర్ నిర్మాణం, ఔటర్ రింగ్ రోడ్డు, స్థానిక డ్యామ్ వద్ద గార్డెన్ వంటి అత్యాధునిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీల పూర్తి సహకారంతో పాలకవర్గం కష్టపడి పనిచేస్తేనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు తాలోడ్ శ్రీనివాస్, శ్రీకాంత్, సుభాష్, వడ్నప్ శ్రీనివాస్, ప్రవీణ్, అమోల్, వాసు, రాహుల్‌తో పాటు జూనియర్ లెక్చరర్ వినోద్, హనుమాన్లు, వెంకట్రావు, కాలనీవాసులు, పెద్దలు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల ప్రతినిధి, మార్చి 14, ప్రభాతవార్త

రెవెన్యూ ఉద్యోగులకు క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని శ్రీ ఉషోదయ పాఠశాల మైదానంలో ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు పని ఒత్తిడి అధికంగా ఉంటుందని, ఒక్కొక్కసారి నిర్ణీత పని వేళలను మించి పని చేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ తరుణంలో రెవెన్యూ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడంతో పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుందని తెలిపారు. కార్యాలయాలలో పని ఒత్తిడి దృష్ట్యా శారీరక శ్రమ లేకుండా పని చేయడంతో 40 సంవత్సరాల వయసుకే దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగులకు శారీరక శ్రమ తప్పనిసరిగా ఉండాలని, నిత్యజీవితంలో వ్యాయామం ఒక భాగంగా పాటించాలని తెలిపారు. అనంతరం ఆర్.బి.హెచ్.వి. పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఏప్రిల్ 16వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ 1, 2 పరీక్ష ఉదయం 9.30



గంటల నుండి మధ్యాహ్నం 12.50 గంటల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 11 గంటల వరకు, ఎస్.ఎస్.సి. ఒకేషనల్ కోర్స్ (థియరీ) పరీక్ష ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు, మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మల్లన్న స్వామి ఆలయ ప్రారంభోత్సవం

**- పాల్గొన్న బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్**

జన్నారం, మార్చి 14, ప్రభాతవార్త

జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన మల్లన్న స్వామి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రితేష్ రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రితేష్ రాథోడ్ కు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణానికి భూమి ఇచ్చి సహకరించిన,తమ వంతు ఆర్థిక సాయం అందించి, అంకితభావంతో సహకరించిన దాతలను రితేష్ రాథోడ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. భక్తి భావం సమాజంలో ఐక్యతను పెంచుతుందని, ఆలయాల పునర్నిర్మాణంలో భాగస్వాములవ్వడం అదృష్టమని ఆయన అన్నారు. భక్తుల రాకతో రెండ్లగూడ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో జన్నారం మండల బీజేపీ అధ్యక్షులు మధుసూదన్ రావు,ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు బెడద గోపాల్, జిల్లా నాయకులు శంకరయ్య, పొనకల్ ఉప సర్పంచ్ అప్పాల జలపతి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు అజ్మీరా బద్రి నాయక్, బిజెవైఎం రాష్ట్ర నాయకులు పవన్ యాదవ్, మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రెండ్లగూడ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





విద్యార్థులను చెక్ చేసి పరీక్ష హాల్ లోకి పంపిస్తున్న ఇన్విజిలేటర్లు

## పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం

హాజీపూర్, మార్చి 14, ప్రభాతవార్త

2025-26 విద్యా సంవత్సరం 10వ తరగతి వార్షిక పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మండలంలోనీ ఆయా గ్రామాల్లో చదువుతున్న పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల కోసం మండల కేంద్రంలోని సబ్బేపెల్లి ప్రభుత్వ పాఠశాలలో, రాంపూర్ లోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సబ్బెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 210 మంది విద్యార్థులు, శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో 240, రెండు పరీక్ష కేంద్రాలలో కలిపి 450 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆకతాయిలు అలజడి చేయకుండా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలు సమీపంలో 144 సెక్షన్ విదించడం జరిగిందని ఎస్సై కిరణ్ కుమార్ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని మండల విద్యాధికారి తెలిపారు. వేసవి కాలం కావడం వల్ల పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యంతో పాటు, వైద్య సిబ్బందిని సైతం నియమించడం జరిగిందన్నారు.

వేమనపల్లి, మార్చి 14, ప్రభాతవార్త



మండల కేంద్రంలో శనివారం మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఎహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాల కేంద్రంలో 188 మంది విద్యార్థులకు 186 మంది విద్యార్థులు హాజరవ్వగా జడ్పీహెచ్ఎస్ వేమనపల్లి నుండి 44, ఎహెచ్ఎస్ నుండి 58, కస్తూరిబా నుండి 48 మందికి గాను 46 మంది హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరు, జడ్పీహెచ్ఎస్ నీల్వాయి నుంచి 38 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి బొబ్బల శ్రీధర్ రెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆకతాయిలు అలజడి చేయకుండా పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు. చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రం వద్ద144 సెక్షన్ విధించడం జరిగిందని ఎస్సై జగదీశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు.

## రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, మార్చి 14, ప్రభాతవార్త



మండలంలోని ఆడిగామ(బి) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి దుకాణాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలోని శబరిమాత ఆలయ ప్రాంగణంలో నూతనంగా వేసిన బోరును కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు రేషన్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా, వారి సౌకర్యార్థమే గ్రామంలోనే ఈ కొత్త దుకాణాన్ని ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి హాజరైన ముస్లిం మహిళలు

# రాజకీయాలకు అతీతంగా ఏడేళ్లుగా రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నాం

★ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ★ నియోజకవర్గంలో 5,500 ముస్లిం కుటుంబాలకు తోఫా అందజేత

★ నస్పూర్ అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్న ఎమ్మెల్యే

నస్పూర్, మార్చి 14, ప్రభాతవార్త

రాజకీయాలకు అతీతంగా, గెలుపోటములతో సంబంధం లేకుండా గత ఏడు సంవత్సరాలుగా ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పేర్కొన్నారు. శనివారం నస్పూర్ పట్టణంలోని ఎంఎం గార్డెన్‌లో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి ఆయన ఈ కానుకలను అందజేశారు. నియోజకవర్గంలోని సుమారు 5,500 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సేవా కార్యక్రమం ప్రతి ఏడాది నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. మంచిర్యాల పట్టణంతో సమానంగా నస్పూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు ప్రేమ్ సాగర్ రావు వివరించారు. ఈ ఉద్దేశంతోనే నస్పూర్ ప్రాంతానికి మేయర్ అవకాశం కల్పించినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలతో పాటు మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి సొంత ఇంటి కల నిజం చేయడానికి శాయశక్తులా ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేగా తన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తానని ప్రకటించారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ సంఖ్యలో గెలిపించి మంచిర్యాల కాంగ్రెస్ అడ్డా అని నిరూపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జాం గ్రామస్థులు, నాయకులు

## ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని కలిసిన జాం గ్రామస్థులు

సారంగాపూర్, మార్చి 14, ప్రభాతవార్త:

మండలంలోని జాం గ్రామ ప్రజలు శనివారం నిర్మల్‌లో ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిపే విలాస్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ఆలయ సంఘ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. గ్రామస్థుల విన్నపంపై ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరలోనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజలింగం, మండల పార్టీ ఉపాధ్యక్షులు వెలిశాల తిరుమల చారి, నలిమెల రాము, బొడ్డు రాజేశ్వర్, వార్డు సభ్యులు, ఆలయ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

జైనూర్, మార్చి 14, ప్రభాతవార్త:

కొమరం భీం జిల్లా జైనూర్ మండలంలోని బూసిమెట్ట పంచాయతీ పరిధిలో గల బూసిమెట్ట క్యాంపు గ్రామంలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పంచాయతీ సర్పంచ్ ఆత్రం సింధు నగేష్ ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కారోబారి కేజురావు, గ్రామ పటేల్ గోటేకర్ మారుతీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

జైనూర్, మార్చి 14, ప్రభాతవార్త:

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీ మండలాల్లో శనివారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం గదుల్లోకి అనుమతించారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్, జైనూర్, సిర్పూర్ (యు) మండలాల్లోని కేంద్రాలను అధికారులు సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు, మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. జైనూర్ మండల విద్యాశాఖాధికారి ఆడ బీర్షావ్, సిర్పూర్ (యు) మండల విద్యాశాఖాధికారులు ఆశన్న, కుడిమెత సుధాకర్ పలు కేంద్రాలను తనిఖీ చేసి ఇన్విజిలేటర్లకు పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భద్రతా చర్యలు చేపట్టారు.





పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న డాక్టర్ రాకేష్

## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

పెంచికల్‌పేట్, మార్చి 14, ప్రభాతవార్త :

మండలంలోని ఎల్లూర్ గ్రామపంచాయతీలో పశువైద్యాధికారి రాకేష్ ఆధ్వర్యంలో శనివారం పశువులు మేకలకు ఉచిత గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వచ్చే వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చప్పిడి రవీందర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు చల్లని నీరు అందజేత

వాంకిడి, మార్చి 14, ప్రభాతవార్త

వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం నుండి ప్రారంభం అయిన పదవ తరగతి విద్యార్థులకు దాహార్తి తీర్చడానికి సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు చల్లని మినరల్ వాటర్ ఉచితంగా విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు దుర్గం సందీప్ ఆర్గనైజర్లు ప్రతాప్ మిలింద్ రోషన్ రమేష్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసి భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకొని మంచి ఉద్యోగాలు సంపాదించి గ్రామానికి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సమత సైనిక్ దళ్ సంఘ సభ్యులు తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ప్రభాతవార్త

ముస్లింల పవిత్ర మాసం ప్రారంభమైన సందర్భంగా పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ జన్నారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైన మాసమని, ఈ మాసంలో చేసే ప్రార్థనలు, దానధర్మాలు, అందరికీ శాంతి, సౌభ్రాతృత్వం, సమృద్ధిని కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొనకల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముజఫర్ అలీ ఖాన్, కాంగ్రెస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు

జన్నారం, మార్చి 14, ప్రభాతవార్త:

జన్నారం మండలంలో పదవ తరగతి పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఈఓ ఎన్ విజయ్ కుమార్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. మొదటిరోజు పరీక్షల్లో మండలం మొత్తంలో ఒక్క విద్యార్థి మాత్రమే గైర్హాజరయ్యారని తెలిపారు.



ఎమ్మెల్యే వినోద్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

## ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులను ప్రారంభించాలి

**తాండూర్, మార్చ్ 14, ప్రభాతవార్త :**

మండలంలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-2027 విద్యా సంవత్సరం నుండి తరగతులు ప్రారంభించాలని మండల వాసులు కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థి సంఘాలు, యువజన నాయకులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వినోద్ కృషి వలన మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు అయిందన్నారు. విద్యార్థులకు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం వలన బెల్లంపల్లి, మంచిర్యాల వంటి పట్టణాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తుందన్నారు. పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు చెల్లించే స్తోమత లేక, ప్రయాణ ఖర్చులు భరించలేక పదో తరగతితోనే మధ్యలో చదువు ఆపేస్తున్నరన్నారు.

శాశ్వత భవన నిర్మాణం పూర్తయ్యే వరకు, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏదైనా ప్రభుత్వ భవనంలో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## మెగా వైద్య శిబిరం విజయవంతం

**- 158మందికి వైద్య పరీక్షలు**

**పెంచికల్ పేట్, మార్చి 14, ప్రభాతవార్త :**

ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా పెంచికల్ పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ భక్తు రాంచందర్ రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మెగా వైద్య శిబిరంలో 158మంది రోగులు వైద్య సేవలు పొందారు. వివిధ విభాగాల నిపుణ వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. మరింత చికిత్స అవసరమైన కొంతమందిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ అశ్రిన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణ వైద్య సేవలు కల్పించడం వల్ల శిబిరానికి మంచి స్పందన లభించిందని అన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో ప్రత్యేక విభాగల వైద్యులు, గిరీష్, నవ్య, శ్రావంతి, దేవేందర్, ప్రవళిక, విశాఖ, ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొని సేవలందించారు.

# ఘనంగా జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- పార్టీని బలోపేతం చేసి ప్రజలకు సేవలు అందించే దిశగా జనసైనికులు కృషి చేయాలి**

**- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం అడ్ హాక్ కమిటీ సభ్యుడు అల్లూరి సాయి కుమార్, జిల్లా నాయకుడు ఈర్ల సునీల్**

**కాగజ్‌నగర్ రూరల్ ,మార్చి 14, ప్రభాతవార్త :**

జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో శనివారం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి పార్టీ స్థాపన దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువజన విభాగం అడ్ హాక్ కమిటీ సభ్యుడు అల్లూరి సాయి కుమార్, జిల్లా నాయకుడు ఈర్ల సునీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జనసేన పార్టీ రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా బలపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి ప్రజలకు సేవలు అందించే దిశగా జనసైనికులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే రోజుల్లో సిర్పూర్ నియోజకవర్గంలో జనసేన పార్టీ జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త నిబద్ధతతో పని చేయాలని తెలిపారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేయడం జనసేన పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొంతమందిని పార్టీ క్రియాశీల సభ్యులుగా చేర్చారు. ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతున్న జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్సూరెన్స్,ప్రమాద భీమా వంటి పలు ప్రయోజనాలు లభిస్తాయని, ఇవి సాధారణ ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. అందువల్ల జనసేన



కేక్‌కట్ చేస్తున్న జనసేన నాయకులు

కార్యకర్తలు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు కూడా క్రియాశీల సభ్యులుగా చేరాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పార్టీ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం సందర్భంగా జనసేన కార్యకర్తలు పార్టీ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు పోతుల ప్రవీణ్, శెట్టి రాజేష్, అక్కనపెల్లి బాలేష్, ఎస్కే ఇక్బాల్, ఆర్నకొండ రవి, రేగళ్ల నవీన్, మాటూరి అశోక్, పెరుగు మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

**- ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు**

**చింతలమానేపల్లి, మార్చి 14, ప్రభాతవార్త:**


మండల పరిధిలో శనివారం పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మండలంలోని రెండు కేంద్రాల్లో మొత్తం 291 మంది విద్యార్థులకు గాను 289 మంది పరీక్షకు హాజరయ్యారు. కేజీబీవీ పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు చిప్ సుపరిండెంట్ అధికారులు బండయ్య, రామయ్య డిపార్ట్మెంట్ ఆఫీసర్ ఉషాన్న, భీమయ్య తెలిపారు. పరీక్షల నిర్వహణను తహసిల్దార్ వెంకటేశ్వరరావు, ఎంఈవో జయరాజ్,లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులకు తాగునీరు వంటి కనీస వసతులు కల్పించి, పరీక్షలు సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.



## మార్చిలోనే వికసించిన మే పుష్పాలు

**- ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్న ఎర్రటి పూల సోయగం**


**నస్పూర్, మార్చి 14, ప్రభాతవార్త**



సాధారణంగా మే నెలలో పూసే మే పుష్పాలు ఈ ఏడాది మార్చి రెండో వారంలోనే వికసించి ప్రకృతి ప్రేమికులను అబ్బురపరుస్తున్నాయి. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలంలోని సీతారాంపల్లికి చెందిన సింగరేణి కార్మికుడు జాడి రాజ్ కుమార్ ఇంటి ఆవరణలో ఈ అరుదైన పుష్పాలు వికసించి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఏడాదికి ఒకసారి మాత్రమే అతిథిలా వచ్చి ఆకర్షించే ఈ పూల కోసం ప్రకృతి ప్రేమికులు ఆత్రుతగా వేచి చూస్తారు. ఈ సారి ఎండల ప్రభావమో లేదా వాతావరణ మార్పుల వల్లనో గానీ నెల రోజుల ముందే ఇవి పూయడం విశేషం. ఏకధాటిగా నాలుగు పూలు పూయడంతో స్థానికులు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అనే అరుదైన జాతికి చెందిన ఈ పువ్వును భారతదేశంలో మే పుష్పం అని పిలుస్తారు. ఎరుపు వర్ణంలో, గుబురుగా బంతి ఆకారంలో ఉండే ఈ పుష్పాలు ఏప్రిల్, మే నెలల్లో వికసిస్తాయి. దుంప రకానికి చెందిన ఈ మొక్కలు భూమిలో విస్తరిస్తూ ఒక్కో దుంపకు ఏడాదికి ఒక పువ్వును మాత్రమే పూస్తాయి. సుమారు రెండేళ్ల క్రితం ఒక నర్సరీ నుంచి తెచ్చిన దుంపలను రాజ్ కుమార్ తన ఇంటి వద్ద నాటారు. మొదటి ఏడాది ఒక పువ్వు మాత్రమే పూయగా, ఈసారి మొక్కలు విస్తరించి నాలుగు పూలు వికసించాయి. ఇసుక నేలల్లో బాగా పెరిగే ఈ మొక్కలు మొగ్గ తొడిగిన నాటి నుంచి వికసించడానికి దాదాపు 20 రోజులు పడుతుంది. ఇవి రోజులో సుమారు నాలుగు గంటల పాటు వికసించి పర్యావరణ ప్రేమికులను అలరిస్తున్నాయి. ముందే వికసించిన ఈ మే పుష్పాలను చూసి ఆనందిస్తున్న పర్యావరణ ప్రేమికులు, స్థానికులు వాటి వద్ద సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.

### పర్యావరణ పరిరక్షణే లక్ష్యం..

పర్యావరణం, ప్రకృతి అంటే తనకు ఎంతో ఇష్టమని జాడి రాజ్ కుమార్ తెలిపారు. తన గురువు, పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్‌ను ఆదర్శంగా తీసుకుని గత కొన్నేళ్లుగా పర్యావరణ హిత కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ప్రకృతి రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు. చెట్లను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. పర్యావరణాన్ని కాపాడటానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు.




# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో పరిశుభ్రతకు ప్రాధాన్యం



ప్రధాన చౌరస్తాలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్

**పెంచికల్ పేట్, మార్చి 14, ప్రభాతవార్త :**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పెంచికల్ పేట్ మండలం ఎల్కపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ భక్తు రాంచందర్ పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం, ప్రధాన చౌరస్తా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణలలో బ్లెడ్ ట్రాక్టర్ సహాయంతో పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంచందర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, కార్యదర్శి చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.